క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



నిజాంపట్నం: ప్రజలు, వాహన చోదకుల సౌకర్యార్థం స్వచ్ఛందంగా దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావటం అభినందనీయమని ఉపాధ్యాయుడు కె.హరనాథ్‌బాబు అన్నారు. మండల కేంద్రమైన నిజాంపట్నం మెయిన్ బజారులోని గాంధీ విగ్రహం వద్ద గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పెళ్ళూరు కృష్ణప్రసాద్, పద్మసందీప్‌ల జ్ఞాపకార్థం పెళ్ళూరు హనుమంతరావు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చలివేంద్రం ప్రజలు, వాహన చోదకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం చైర్మన్ కె.గౌరీ శంకర్, జాయింట్ సెక్రటరీ డి.బసవరాజు, కమిటీ మెంబర్‌లు చావలి కోటేశ్వరరావు, నాగరాజు, ఆలమూరు కృష్ణారావు, నాళం సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కర్లపాలెం: డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో చెప్పారు. డీఎస్సీ 2025 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణకు బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులు తమ దరఖాస్తులను వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత జిల్లా కేంద్రానికి దరఖాస్తు చేయాలని సూచించారు. టెట్ పరీక్షల్లో క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్ శిక్షణకు అర్హులని తెలియజేశారు. అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, ఆదాయం, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేయాలని ఎంపీడీవో తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితునికి చేయూత



కర్లపాలెం: వేసవికాలంలో అగ్ని ప్రమాదం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కరుణా జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ఇనకొల్లు పోలీస్‌రావు చెప్పారు. నల్లమోతు వారిపాలెంలో ఆదివారం పూరిగృహం దగ్ధమైన బాధితుడు రాచూరి సాంబయ్యకు గురువారం కరుణా జీవన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బియ్యం, దుస్తులు, వంటపాత్రలు, నిత్యావసర సరుకులను పోలీస్‌రావు అందజేశారు. అనంతరం అదే గ్రామంలో గిరిజన వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌రావు మాట్లాడుతూ బొంతా శ్యామ్యూల్ త్యాగ్‌రాజ్ ఆర్థిక సహకారంతో అగ్ని ప్రమాద బాధితునికి, వృద్ధులకు చేయూత నందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.విజయ్ కుమార్, మినిస్ట్రీస్ సభ్యులు తుమ్మా కొండలు, వడ్లమూడి సురేంద్రబాబు పాల్గొన్నారు.

'ఆళ్ల'కు అంతర్జాతీయ మనస్సాక్షి దినోత్సవ అవార్డు

తెనాలి: ప్రముఖ రచయిత, కవి, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు ఉగాండాలోని 'ఓయం డిజిటల్ అకడమిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' అంతర్జాతీయ మనస్సాక్షి దినోత్సవ అవార్డు లభించింది. ఇటీవల జరిగిన అంతర్జాతీయ మనస్సాక్షి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డును గురువారం ఆన్‌లైన్ వేదికగా అందజేశారు. విభిన్న నేపథ్యాలు, వృత్తుల నుంచి ఆధ్యాత్మిక వృద్ధి, స్వీయ అవగాహన, మనస్సాక్షి ఆధారిత చర్యలను ప్రోత్సహించే వ్యక్తులను గుర్తించి ప్రతి సంవత్సరం ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలియజేశారు. మనస్సాక్షి మార్గ నిర్దేశం చేసిన నిర్ణయాలకు ఇతరులను వారి మనస్సాక్షిని అనుసరించి ప్రేరేపించేలా రచనలు చేస్తున్న కారణంగా ఆళ్లకు ఈ పురస్కారాన్ని అందజేశామని తెలిపారు.

కొనసాగుతున్న సదరం క్యాంప్



తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. శుక్రవారం కూడా క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి చెప్పారు.

ఊరిలోనే వైద్య సేవలు

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హెచ్‌ఐవీ పరీక్ష కేంద్రం ఏర్పాటు
- గర్భిణులకు అందుతున్న ప్రత్యేక వైద్య సేవలు
- హెచ్‌ఐవీ లక్షణాలు ఉంటే రక్త పరీక్ష ఉచితం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్న ఊరిలోనే ప్రజలకు విద్య, వైద్యం అందించాలని పాఠశాలలు, ఆస్పత్రులను వేల కోట్ల రూపాయలను మంజూరు చేసి అభివృద్ధి చేశారు. దీంతో ఊరూరా పాఠశాలలు, ఆస్పత్రులు ఏర్పాటై కొత్త రూపు సంతరించుకున్నాయి. విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రజలకు వారి ఊరిలోనే వైద్య సేవలు, వారి పిల్లలకు విద్య అందుతున్నాయి. ఈ కోవలోకే వస్తుంది వేమూరు సామాజిక ఆరోగ్య కేంద్రం.



సామాజిక ఆరోగ్య కేంద్రం, వేమూరు

వేమూరు: గర్భిణులు హెచ్‌ఐవీ పరీక్షల కోసం తెనాలి, గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లకుండా, గత ప్రభుత్వం వేమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌ఐవీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసింది. దీంతో గర్భిణులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా సామాజిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకుంటున్నారు. అలాగే సామాజిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన భవన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేసింది. దీంతో కొత్త భవనాలు ఏర్పాటు చేశారు. ఒక భవనంలో ఓపీ విభాగం, రెండో భవనంలో రోగులకు ప్రత్యేక రూమ్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 30 పడకలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు 100 మంది రోగులు ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు

సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ ఉన్న హెచ్‌ఐవీ ప్రత్యేక పరీక్ష కేంద్రం ద్వారా ప్రతి గర్భిణికీ హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించడం, హెచ్‌ఐవీపై భార్యభర్తలకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుంది. సాధారణ ప్రసవాలు, అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా నిర్వహిస్తున్నారు. వేమూరు నియోజకవర్గంలో వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల నుంచి గర్భిణులు అధిక సంఖ్యలో వచ్చి ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రోగాలకు వైద్యులు ఉండటం వల్ల రోగులకు మంచి వైద్య సేవలు అందిస్తున్నారు.

సమాచారం గోప్యం

సామాజిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌ఐవీ పరీక్షల్లో లక్షణాలు కనిపిస్తే వారి సమాచారం గోప్యంగా ఉంచి, వారిని ఏఆర్‌టీ సెంటరుకు పంపించడం జరుగుతుంది. వారికి మందులు వాడే విధానం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తారు. ఆహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరుగుతుంది. తల్లుల నుంచి బిడ్డలకు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు తెలియజేస్తారు.

ఉచితంగా రక్త పరీక్ష



సామాజిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌ఐవీ పరీక్ష కేంద్రం గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గర్భిణులకు, భార్యభర్తలకు హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించి, హెచ్‌ఐవీపై భార్యభర్తలకు కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుంది. హెచ్‌ఐవీ లక్షణాలు ఉంటే రక్త పరీక్ష ఉచితంగా చేయడం జరుగుతుంది.

– సయ్యద్ జారీన్ పర్వాన్, వైద్యాధికారి, వేమూరు

మెరుగైన వైద్య సేవలు



గత ప్రభుత్వం వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల వైద్యులు రోగులపై దృష్టి సారించి మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుంది. గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు.

గుమ్మడి దానియేలు, వేమూరు

విద్యార్థినులు శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలి

మహిళా పీఎస్ సీఐ కె.శ్రీనివాసరావు



శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమంలో మహిళా పీఎస్ సీఐ శ్రీనివాసరావు, విద్యార్థినులు

బాపట్లటౌన్: విద్యార్థినులు శక్తి యాప్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పట్టణంలోని డాక్టర్ ఎన్‌టీఆర్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సీఐ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. శక్తి యాప్ మహిళల భద్రత కొరకు రూపొందించబడిందన్నారు. అత్యవసర పరిస్థితులలో పోలీస్ తక్షణ సహాయం అవసరమైనప్పుడు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆపదలో చిక్కుకున్న విద్యార్థినులు యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే దగ్గరలోని పోలీసులు నిమిషాల వ్యవధిలో ఆ ప్రదేశానికి చేరుకొని రక్షణ కల్పిస్తారన్నారు. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో యాప్‌లోని సేఫ్ ట్రావెల్ ఆప్షన్ ఎంచుకుంటే సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడంలో సహాయపడుతుందన్నారు. యాప్‌లో మహిళలకు అవసరమైన సమాచారం పొందు పరచబడి ఉందన్నారు. సఖి వన్ స్టాప్ సెంటర్, అత్యవసర ఫోన్ నంబర్లు, దగ్గరలోని పోలీస్ స్టేషన్, కార్యాలయాల వివరాలు వారి ఫోన్ నంబర్లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల శక్తి బృందం ఎస్ఐ పి.జనార్దన్‌రావు, ఉమెన్ ఏఎస్ఐ ఎల్.లక్ష్మీరాజ్యం, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

14న మెగా టెన్నిస్‌బాల్ టోర్నమెంట్

పెరవలి(వేమూరు): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీన మెగా టెన్నిస్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ యూత్ సభ్యులు తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14న మధ్యాహ్నం 2 గంటలకు మెగా టెన్నిస్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.20,116, రెండవ బహుమతి రూ.15,116, మూడవ బహుమతి రూ.10,116, నాల్గవ బహుమతి రూ.7,116, ఐదవ బహుమతి రూ.5,116, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ రూ.2,116 నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందని యూత్ సభ్యులు తెలిపారు.

నీటి తీరువా పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

చుండూరు(వేమూరు): నీటి తీరువా పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని తహసీల్దారు నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వీఆర్వోలు నీటి తీరువా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. శుక్రవారం నుంచి వీఆర్వోల నీటి తీరువా పన్నులపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన వసూలు చేయాలని ఆయన కోరారు.

ఎండీయూ వాహనం సీజ్



తెనాలిరూరల్: తెనాలి నుంచి బాపట్ల జిల్లా చుండూరు మండలానికి రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు బస్తాలను లోడ్ చేస్తుండగా ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. పట్టణ చెంచుపేట డొంక రోడ్డులో ఓ డీలరు వద్ద ఎండీయూ వాహనంలో రేషన్ బియ్యాన్ని లోడ్ చేస్తున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు వెళ్లగా వాహనంలో 15 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. రెవెన్యూ అధికారులకు సమాచారమివ్వగా వారు వచ్చి పరిశీలించారు. ఎండీయూ వాహనం చుండూరు మండలానిదని, పక్క జిల్లా నుంచి వాహనాన్ని ఎందుకు తెప్పించావని ఆపరేటర్‌ని ప్రశ్నించగా తన వాహనం మరమ్మతులకు గురవడంతో రేషన్ పంపిణీ కోసం చుండూరు వాహనాన్ని తెప్పించినట్టు తెలిపాడు. బియ్యం బస్తాలు, వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. త్రీ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

ఘనంగా మహావీర్ శోభాయాత్ర



మహావీరుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న జైనులు



శోభాయాత్రలో పాల్గొన్న జైన మహిళలు

తెనాలిరూరల్: జైనులు దైవంగా ఆరాధించే మహావీర్‌స్వామి జయంతి సందర్భంగా తెనాలి పట్టణ జైన సంఘీయుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక శోభాయాత్ర నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో జైన తీర్థంకర్ మహావీర్ స్వామి చిత్రపటాలకు పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. తెనాలి గంగానమ్మ పేటలోని జైన్ మందిరం నుంచి ప్రారంభమైన ఊరేగింపు నెహ్రూ రోడ్, గాంధీ చౌక్, బోస్ రోడ్డు, మెయిన్ రోడ్ల మీదుగా తిరిగి ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన శోభాయాత్రలో సంఘ పెద్దలు, చిన్నారులు, వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జైన్ మహావీరుని ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తూ, గీతాలాపనలు, నృత్య ప్రదర్శనలు చేశారు. జైన మత ఉద్దేశాన్ని తెలియజేశారు. జైన మతం కేవలం భారతదేశంలోనే కాదని పాశ్చాత్య దేశాల్లోనూ విస్తరించినట్లు సంఘీయులు తెలియజేశారు. జైన మత ధర్మాన్ని వివరించారు. నేమిచంద్ గోవానీ, రమేష్ చౌదరి, రమేష్ భన్సాలీ, అశోక్ చౌదరి, శాంతిలాల్ సంఘ్వి, నరేష్ బగ్రేచా, బాబులాలి గాదియా తదితర పట్టణ జైన సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

సినిమా ఆడిషన్లను మా-ఏపీ నిర్వహించదు

'మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా



రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను, లోగో విడుదల చేస్తున్న దిలీప్‌రాజా

తెనాలి: మా-ఏపీ ఆధ్వర్యంలో ఈ నెల 16న తెనాలిలో సినిమా ఆడిషన్ల నిర్వహణపై వస్తున్న వార్తలకు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదని 'మా-ఏపీ' వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా స్పష్టం చేశారు. సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన నటీనటుల కోసం మా-ఏపీ ఆడిషన్లు చేయదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2018లో మా-ఏపీ రిజిస్టరైనట్లు చెప్పారు. అప్పటి ముఖ్యమంత్రి చేతులమీదుగా 'మా-ఏపీ' సంస్థ లోగోను లాంఛనంగా విడుదల చేశామన్నారు. 2018లో తమకు రిజిస్టరయిన టైటిల్ (మా-ఏపీ)వేరొకరికి ఏవిధంగా వర్తిస్తుందని ఆయన సంబంధిత అధికారులను ప్రశ్నించారు. తమ సంస్థ పేరుతో తెనాలిలో వేరెవరో ఈ నెల 16న ఆడిషన్లు పెడుతున్నట్టుగా జరుగుతున్న ప్రచారంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 16న తెనాలిలో సినిమా ఆడిషన్ల నిర్వహణకు మా-ఏపీకి ఎలాంటి సంబంధం లేదని దిలీప్‌రాజా చెప్పారు. ఇప్పుడే కాదు వేరెప్పుడూ కూడా తమ మా-ఏపీ సంస్థ ఆడిషన్లను నిర్వహించదని చెబుతూ ఔత్సాహిక నటీనటులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. వీరితో వర్ధమాన దర్శకుడు మణివరన్, నటుడు మిలటరీ ప్రసాద్ ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో తెక్కెళ్లపాడుకు చెందిన సిబార్ దంత వైద్యశాల బృందం రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సువర్ణలత, ప్రోగ్రామ్ రిప్రజెంటేటివ్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ కిరణ్, డాక్టర్ శ్రీలేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

డీఎల్‌పీవో వి.స్వరూప



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు తెనాలి సబ్‌కలెక్టర్, గుంటూరు కలెక్టరేట్‌లో గ్రామంలోని సమస్యలకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా గురువారం డీఎల్‌పీవో వి.స్వరూప పర్యటించి అర్జీదారుల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని బందుల దొడ్డి సర్వే చేయించాలని, రహదారిపై ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేస్తున్నారని, ఆక్రమణల తొలగింపు, పన్ను వసూలకు సంబంధించి ఫిర్యాదులు రాగా పరిశీలించి పరిష్కార దిశగా అధికారులకు సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఆమె వెంట పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి కరిముల్లా, సిబ్బంది, అర్జీదారులు, గ్రామస్తులు ఉన్నారు.

రుణాల వసూళ్లలో దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు

డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, పట్టణ సీఐ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: ప్రజలకు రుణాలు అందించి వాటిని ఏజెంట్ల ద్వారా తిరిగి వసూలు చేసే సమయంలో ఏ మాత్రం దురుసుతనం వహించినా చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో మైక్రో ఫైనాన్స్, ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణగ్రహీతలు తమ రుణాలను తిరిగి చెల్లించేందుకు వివిధ కారణాల నేపథ్యంలో ఒక్కోసారి కొంత మేర జాప్యం జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని రుణగ్రహీతలను అవమానపరిచే విధంగా మాట్లాడటం, వస్తువులు లాక్కోనటం, భౌతిక దాడులకు పాల్పడటం నేరమని, సున్నిత స్వభావం కలిగిన వ్యక్తులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయన్నారు. రుణాలు వసూలు చేసే సమయంలో చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడినట్లు మా దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రుణాల రికవరీ విధానాలను తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ మల్లికార్జునరావు, వివిధ మైక్రోఫైనాన్స్, ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టిక విలువలతో సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీవో సుచిత్ర



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సుచిత్ర

రేపల్లె రూరల్: పౌష్టిక విలువలతో కూడిన ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీవో ఎం.సుచిత్ర తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా గురువారం బేతపూడి సెక్టారు పరిధిలోని బేతపూడి-2 అంగన్‌వాడీ సెంటరులో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూరగాయలు, పాలు, ఆకు కూరలను నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. పౌష్టికాహార లోపంతో అనేక రకాల రుగ్మతలను ఎదుర్కొనాల్సిన పరిస్థితులు ఉంటాయన్నారు. తప్పనిసరిగా సంపూర్ణ ఆహారం తీసుకోవటంతో పాటు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. అప్పుడే పుట్టిన చిన్నారికి తల్లి మర్రుపాలు పట్టించాలన్నారు. అప్పుడే చిన్నారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. సకాలంలో చిన్నారులకు అవసరమైన టీకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరత్నం, అంగన్‌వాడీ కార్యకర్త దుర్గ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి తెనాలి డబుల్‌హార్స్ 'మిల్లెట్ మార్వెల్స్'

- తృణధాన్యాల ఉత్పత్తుల విభాగంలోకి తెనాలి డబుల్ హార్స్
- దశలవారీగా విదేశాలకు మిల్లెట్ మార్వెల్స్
- గ్రూప్ సీఎండీ మునగాల మోహన్‌శ్యామ్‌ప్రసాద్



'మిల్లెట్ మార్వెల్స్' విడుదలలో మోహన్‌శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ సంగీతరెడ్డి

తెనాలి: పప్పులు, ధాన్యాల విక్రయంలో ఉన్న తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ తాజాగా తృణ ధాన్యాల ఉత్పత్తుల విభాగంలోకి 'మిల్లెట్ మార్వెల్స్' పేరుతో ప్రవేశించింది. ఈ బ్రాండ్ కింద ధాన్యాలు, నూడుల్స్, కుకీస్, రెడీ టు కుక్ విభాగంలో 18 రకాల ఉత్పత్తులను ఆఫర్ చేయనుంది. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జేఎండీ, మిల్లెట్ మార్వెల్స్ చైర్మన్ డాక్టర్ సంగీతరెడ్డి చేతుల మీదుగా వీటిని మార్కెట్లోకి విడుదల చేసినట్టు గురువారం తెలియజేశారు. హెల్త్ మిక్సెస్, డయాబెటిక్ ఫ్రెండ్లీ మిక్సెస్, సెమోలినా, పాస్తా, నట్స్ ఫ్రీజ్ డ్రై ఫ్రూట్స్, వెజిటబుల్స్ వంటివి దశలవారీగా మార్కెట్లోకి తేనున్నట్టు తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ సీఎండీ మునగాల మోహన్‌శ్యామ్‌ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఆర్గానిక్ ఉత్పత్తులను సైతం విడుదల చేస్తామన్నారు. తొలుత తెలుగు రాష్ట్రాల్లో మిల్లెట్ మార్వెల్స్ ఉత్పత్తులను ప్రవేశపెడతామని, తర్వాత పాన్ ఇండియా మార్కెట్‌కు విస్తరిస్తామని చెప్పారు. యూఎస్ఏ, కెనడా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తామన్నారు. రాబోయే మూడేళ్లలో గ్రూప్ ఆదాయంలో 5 శాతం మిల్లెట్ మార్వెల్స్ ద్వారా సమకూరుతుందని భావిస్తున్నట్టు సీఎండీ చెప్పారు. 2024-25లో సంస్థ సేల్స్ టర్నోవర్ రూ.535 కోట్లు దాటిందనీ, మూడేళ్లలో నాలుగు అంకెల స్థాయికి టర్నోవర్‌ను చేర్చాలన్నది లక్ష్యంగా వివరించారు. 2005లో కంపెనీ ప్రస్థానం మొదలైందనీ, బ్రాండెడ్ కమోడిటీస్ రంగంలో మార్కెట్ లీడర్‌గా నిలిచామనీ, 12 దేశాల్లో అడుగుపెట్టామనీ, భారత్‌లో 15 రాష్ట్రాలోని కస్టమర్లకు చేరువయ్యామని తెలిపారు. తెనాలి డబుల్ హార్స్ ఉత్పత్తులు జనరల్ ట్రేడ్, మోడరన్ ట్రేడ్, ఈ-కామర్స్, క్విక్ కామర్స్ ద్వారా వినియోగదారులకు అందజేస్తున్నామని, బ్రాండెడ్ అవుట్‌లెట్ల ద్వారా కస్టమర్లకు మరింత అందుబాటులోకి రానున్నామని వివరించారు.

వార్డుమెంబర్ పదవికి రాజీనామా

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు పంచాయతీ వార్డు సభ్యురాలు తన పదవికి రాజీనామా చేశారు. పంచాయతీ పరిధిలోని ఖాజీపేట 14వ వార్డు (ఓసీ-మహిళా) మెంబర్‌గా పనిచేస్తున్న తిరుమలశెట్టి హేమలత తనవార్డులో అభివృద్ధి జరగలేదని, తమ సమస్యలపై ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించలేదన్న కారణంతో రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 4న తన రాజీనామాను తెనాలి మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పంచాయతీ కార్యదర్శికి సమర్పించినట్లు చెప్పారు. రాజీనామాను ఆమోదించినట్లు ఆమెకు సమాచారం ఇచ్చి తదుపరి చర్యల నిమిత్తం బుధవారం జిల్లా పంచాయతీ అధికారికి లేఖ పంపినట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి గురువారం తెలిపారు.

ఇలా.. సేద తీరుతున్నాయి..!



ఎండలు మెండుగా ఉండటంతో జీవాలు సేద తీర్చుకుంటున్నాయి. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామం సమీపంలోని పొలాల్లో ఉన్న చెట్ల కింద జీవాలు సేద తీరుతున్నాయి. మనుషులు ఎండలు అంటే భయపడుతున్నారు. పశువులు, జీవాలు కూడా ఎండ దెబ్బకు తాళలేక చెట్ల నీడకు చేరుతున్నాయి.

- చుండూరు(వేమూరు)